ONE PERSON CAN MAKE DIFFERENCE

B.K. YADAV FOUNDATION


# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

ఆదివారం, మార్చి 16, 2025

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-




## ఇది జగన్మాత ఆదేశం: పవన్‌కల్యాణ్

ఉత్తరాన పరమశివుని కైలాసం ఉందన్న పవన్ కల్యాణ్

కైలాసం, మురుగన్ వెలిసిన ప్రదేశమే భారతదేశమన్న జనసేనాని

సోషల్ మీడియాలో ఆసక్తికర స్పందన

## కుటుంబాన్ని, పిల్లల్ని తిట్టారని రేవంత్ బాధపడుతున్నారు... కానీ...!: కవిత



భారతదేశంలో కర్మ సిద్ధాంతాన్ని బలంగా నమ్ముతామన్న కవిత

రేవంత్ రెడ్డి చేసిందే ఆయనకు తిరిగి వచ్చిందని వ్యాఖ్య

కేసీఆర్ మీద చేసిన వ్యాఖ్యలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్

# మరోసారి నేనే సీఎం : రేవంత్

మొదటిసారి బీఆర్ఎస్ మీద వ్యతిరేకతతో ఓటు వేశారన్న రేవంత్

రెండోసారి మా మీద నమ్మకంతో ఓటు వేస్తారన్న ముఖ్యమంత్రి

ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ప్రజల వద్దకు వెళతామని వెల్లడి

కేసీఆర్ రెండుసార్లు అసెంబ్లీకి వచ్చి రూ.57 లక్షల వేతనం తీసుకున్నారు: రేవంత్

2023 డిసెంబర్ నుంచి 2025 ఫిబ్రవరి వరకు రెండురోజులే సభకు వచ్చారన్న సీఎం

శాసనసభ్యులు కూడా ప్రభుత్వ ఉద్యోగులేనని సుప్రీంకోర్టు తెలిపిందని వెల్లడి

కేసీఆర్ కనీసం నియోజకవర్గ పర్యటనలకూ వెళ్లలేదని వ్యాఖ్య

తాను మరోసారి ముఖ్యమంత్రిని అవుతానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శాసనమండలి వాయిదాపడిన అనంతరం ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు. తెలంగాణ ప్రజలు మొదటిసారి బీఆర్ఎస్ మీద వ్యతిరేకతతో ఓటు వేశారని, రెండోసారి మా మీద నమ్మకంతో ఓటేస్తారని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల నమ్మకాలను నిలబెట్టుకోవడానికి శాయశక్తులా కృషి చేస్తానని ఆయన అన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ప్రజల వద్దకు వెళతామని ఆయన అన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులే మా ఓటర్లు అని ఆయన వెల్లడించారు. పనిని నమ్ముకొని తాము ముందుకు వెళుతున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తమకు స్టేచర్ కంటే స్టేట్ ఫ్యూచర్ ముఖ్యమని స్పష్టం చేశారు. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని పునరుద్ఘాటించారు. హామీ ఇచ్చినట్లుగా కోటి మంది మహిళలకు లబ్ధి చేకూరుస్తామని, వారు ఇప్పుడు మాట్లాడకపోయినా ఓటు కాంగ్రెస్ పార్టీకే వేస్తారని ధీమా

(మిగతా 2వ పేజీలో)





# 45 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను జగన్ వారసత్వంగా ఇచ్చి వెళ్లారు: సీఎం చంద్రబాబు

పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

స్థానికులతో ముఖాముఖి నిర్వహించిన సీఎం చంద్రబాబు

జగన్ కనీసం మురికి కాలువల్లో పూడిక కూడా తీయించలేదని విమర్శలు

పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో ఇవాళ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు స్థానికులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జగన్ ఐదేళ్ల పాలనలో కనీసం మురికి కాలువల్లో పూడిక కూడా తీయించలేదని విమర్శించారు. 45 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను జగన్ వారసత్వంగా ఇచ్చి వెళ్లారని ఎద్దేవా చేశారు. స్వచ్ఛ ఆంధ్ర కోసం ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర తన జీవితాశయం అని స్పష్టం చేశారు. ప్రజల ఆహార అలవాట్లు మారడంతో వ్యాధులు పెరిగాయని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కొన్ని రకాల జబ్బులకు ఖరీదైన చికిత్స అవసరమవుతోందని

(మిగతా 2వ పేజీలో)

# జైల్లో నా పట్ల కఠినంగా వ్యవహరించారు: అమిత్‌షా

ఇందిరాగాంధీ హయాంలో తనను జైల్లో పెట్టారన్న అమిత్ షా

వారం రోజులు జైల్లో ఉంటే భౌతికంగా దాడి చేశారన్న అమిత్ షా

కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు నిర్బంధాలను ఎదుర్కొన్నామన్న కేంద్ర మంత్రి

బీజేపీ అధికారంలోకి వచ్చాక అసోంలో శాంతిభద్రతలు మెరుగయ్యాయన్న అమిత్‌షా





# ఏపీ నిర్మించ తలపెట్టిన ఆ పథకానికి కేంద్రం పర్యావరణ అనుమతులు నిరాకరించింది: ఉత్తమ్ కుమార్ రెడ్డి

ఇది కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన విజయమన్న ఉత్తమ్

ఈ అంశంపై కేంద్రాన్ని పలుమార్లు కలిసి ఫిర్యాదు చేసినట్టు వెల్లడి

తెలంగాణలో కీలక సమయంలో అధికారంలోకి వచ్చాం: ఉత్తమ్

# కేంద్రంపై ఉమ్మేస్తే... ఆకాశంపై ఉమ్మేసినట్టే: బండి సంజయ్

రాష్ట్రంలో 10 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయన్న బండి సంజయ్

దమ్ముంటే ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని సవాల్

కాంగ్రెస్, బీజేపీలు నాటకాలు ఆడుతున్నాయని మండిపాటు

తెలంగాణలో 10 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి బాధ లేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. రైతు భరోసా ఇవ్వరని, రుణమాఫీ చేయరని, పంటనష్టం ఇవ్వరని విమర్శించారు. దమ్ముంటే ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మీద ఉమ్మేస్తే ఆకాశం మీద ఉమ్మేసినట్టేనని చెప్పారు. కేంద్రంపై, బీజేపీ నేతలపై విమర్శలు చేయడాన్ని మానుకోవాలని హితవు పలికారు. అసెంబ్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. రాజకీయ నాయకుల స్టేచర్ గురించి కాకుండా రైతుల ఫ్యూచర్ గురించి ఆలోచించాలని అన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలని చెప్పారు. రైతు సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని సూచించారు.





## వైసీపీ మూకల దాడిలో మరణించిన రామకృష్ణకు కన్నీటి నివాళులు: నారా లోకేశ్

చిత్తూరు జిల్లాలో రామకృష్ణ అనే టీడీపీ కార్యకర్త మృతి: జగన్ పై లోకేశ్ ఫైర్

జనం ఛీ కొట్టినా హత్యా రాజకీయాలు మానడం లేదన్న నారా లోకేశ్

# సికింద్రాబాద్‌లో కవచ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్

రూ.39,300 కోట్లతో రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు

త్వరలో అన్ని రైల్వేస్టేషన్లలో ఉచిత వైఫై సౌకర్యం

మహిళా రైల్వేస్టేషన్‌గా బేగంపేట కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి



# కాన్సీరామ్ భారతరత్న పురస్కారం ఇవ్వాలి భీమ్ ఆర్మీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు తీగల శివకుమార్

సికింద్రాబాద్, వార్త మిర్రర్ మార్చి 15... భీమ్ ఆర్మీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు తీగల శివకుమార్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణములో బహుజన సిదాంతకర్త కాన్సీరామ్ 91 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు, మొదటగా కాన్షిరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళలర్పించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తీగల శివ కుమార్ మాట్లాడుతూ కాన్షీరామ్ పూణేలోని ఎక్స్ప్లోజివ్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ లాబొరేటరీ కార్యాలయాల్లో ఉద్యోగం లో చేరాడు .ఈ సమయంలోనే అతను మొదటిసారి కుల వివక్షను అనుభవించాడు అనీ,బిఆర్ అంబేద్కర్ రాసిన "అన్నిహిలేషన్ ఆఫ్ కాస్ట్ " పుస్తకం చదివిన తాను ప్రేరణ పొంది ఈ దేశం లోనీ అంటరానితనం,కులాతత్వం, పేదరిక నిర్మూలన జరగాలి అంటే రాజ్యాధికారం తోనే సాధ్యం అవుతుంది అనీ భావించి,ఓటు హమారా, రాజ్ తుమ్ మారా నహి చాలేగా అనే నినాదం తో బహుజన సమాజం నీ చైతన్యపరిచి బహుజనులకి రాజ్యాధికారం రుచి చుపించిన మహనీయుడు కాన్షిరాం అనీ,దేశ ప్రజల కోసం తన జీవితం నీ త్యాగం చేసిన మాన్యశ్రీ కాన్షిరాం కీ భారత రత్న పురస్కారం తో సత్కారించావాల్సిందిన అవసరం ఎంతైనా ఉంది అనీ కేంద్ర ప్రభుత్వం నీ కోరడమైనది.ఈ రాష్ట్రము లో బహుజన రాజ్యాధికారం తీసుకురావటమే కాన్షిరాం కీ అసలు అయినా నివాళి అనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం కి ముఖ్య అతిధిగా పాల్గొన్న బహుజన స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డా. కత్తి వీరన్న మాట్లాడుతూ రాజకీయాలను శాసించాల్సిన సంఖ్యా బలం కలిగినటువంటి ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనార్టీలు లను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు దిగజార్చినటువంటి మనువాద రాజకీయ పార్టీలపై నిప్పులు జరిగాడు, తెలంగాణ రాష్ట్రంలో కమ్యూనిజం బ్రాహ్మణిజం కలిగినటువంటి పార్టీలు కాదు పాలించాల్సింది



,బహుజన వాదం కలిగినటువంటి రాజకీయ పార్టీ అధికారం లోకి రావాలని ఆకాంక్షించాడు. ఆ దిశగా పయనించాలని నూటికి 85% ఉన్నటువంటి కులాల వాళ్ళు తమ ఓటు హక్కును ఉపయోగించుకొని రాజ్యాధికార దిశగా పయనించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమం లో బి ఏ ఎస్ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర సురేందర్,సైదులు, పర్రెపటి శోభనబాబు,కొప్పులు క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా సీనియర్ జర్నలిస్ట్ సాయికుమార్ జన్మదిన వేడుకలు





వార్త మిర్రర్ రాయికల్(తిరుమల శంకర్) మార్చి 15 : సీనియర్ జర్నలిస్ట్ సాయి కుమార్ జన్మదిన వేడుకలు రాయికల్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శనివారం రోజున రాయికల్ తహసీల్దార్ ఎం ఏ ఖయ్యుమ్ ఆధ్వర్యంలో కేకు కట్ చేసి జన్మదిన వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా తోటి జర్నలిస్ట్ మిత్రులు మాట్లాడుతూ అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ, సమస్య ఉంది అంటూ తన వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికి సలహాలు అందిస్తూ... సామాజిక సేవ రంగంలో గత రెండు దశాబ్దాలుగా ప్రజల్లో మమేకమై సేవా సాయిగా గుర్తింపు పొందిన మా పాత్రికేయ మిత్రుడు చింతకుంట సాయికుమార్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సాయికుమార్ ను తోటి జర్నలిస్ట్ లు శాలువ కప్పి పూలమాల తో ఘనంగా సన్మానించారు. సాయికుమార్ మాట్లాడుతూ ఏ పూర్వ జన్మ సుకృతమో మీ స్నేహం మీ అనుబంధం కలకాలం ఇలాగే ఉండాలని, మీ ఆశీర్వాదాలు , అందించినాకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన నా జర్నలిస్టు మిత్రులు, రాజకీయ ప్రముఖులు, శ్రేయోభిలాషులు, అధికారులు అందరికీ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఖయ్యూమ్, రిపోర్టర్ మిత్రులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 17 నుంచి కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం

**ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అంకిత భావంతో పనిచేయాలి**

**జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు**






రంగారెడ్డి, వార్త మిర్రర్ : జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా, కుష్టు వ్యాధి గుర్తింపు ఉద్యమం, LCDC-25 కార్యక్రమం పై జిల్లాలోని జిల్లా స్థాయి అధికారులు, వైద్యాధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం, వర్క్ షాప్ నిర్వహించారు.రంగారెడ్డి జిల్లా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం, కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమం లో జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం మార్చ్ నెల 17 వ తేది నుండి 30 వ తేదీ వరకు జరుగుతుందని, ఈ రోజులలో ఆశ కార్యకర్తలు ఉదయం 9 గంటల లోపు ప్రతీ ఒక్కరి ఇంటికి వెళ్లి అందరిని లేప్రోసి వ్యాధి లక్షణాలకోసం పరీక్షలు చేస్తారని చెప్పారు. అనుమానం ఉన్నవారిని దగ్గర లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిస్తారని చెప్పారు. ప్రతీ ఒక్కరు అంకిత భావంతో పనిచేసి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి, డా. పాపా రావు మాట్లాడుతూ, వ్యాధి వ్యాప్తి చెందే విధానం, లక్షణాలు, చికిత్స గురించి పూర్తి స్థాయిలో అవగాహన కలిపించారు. జిల్లా పారా మెడికల్ అధికారి సులోచన కుష్టు వ్యాధి గుర్తింపు ఉద్యమంలో ప్రతీ రోజు, సర్వే చేసే విధానం, రిపోర్టు తయారు చేసే పద్ధతి వివరించారు. ఈ కార్యక్రమం లో జిల్లాలోని వివిధ ప్రోగ్రాం అధికారులు, ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారులు, వైద్యాధికారులు, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్లు , ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన లెప్రసీ నోడల్ పర్సన్లు, సిబ్బంది, పాల్గొన్నారు.

# సికింద్రాబాద్‌లో కవచ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్

**మహిళా రైల్వేస్టేషన్‌గా బేగంపేట కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి**

సనత్‌నగర్: రైల్వే 'కవచ్'రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సికింద్రాబాద్‌లో ఏర్పాటు కానుందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ సంస్థ తెలంగాణ రాష్ట్రానికి తలమానికంగా నిలవనుందని పేర్కొన్నారు. రైల్వే భద్రతలో కవచ్ వ్యవస్థ ఇప్పటికే పలు ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా విజయవంతమైందని చెప్పారు. బేగంపేట రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులను రైల్వే అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. బేగంపేట, చర్లపల్లి, మేడ్చల్, యాకుత్‌పురా, నాంపల్లి, కాచిగూడ, హైటెక్‌సిటీ, హఫీజ్‌పేట్, మలక్‌పేట్, ఉందానగర్ రైల్వేస్టేషన్ల ఆధునీకరణకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంగీకరించారని తెలిపారు. ఆయా రైల్వేస్టేషన్లకు అప్రోచ్ రోడ్ల కోసం భూమిని సమకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు వెల్లడించారు. బేగంపేట రైల్వేస్టేషన్‌ను రూ.38 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే తొలివిడత పనులు పూర్తయ్యాయని చెప్పారు. దీనిని మహిళా రైల్వేస్టేషన్‌గా మార్చనున్నట్లు కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఇక్కడ సెక్యూరిటీ గార్డ్ నుంచి ఉన్నతాధికారి వరకు అంతా మహిళలే ఉంటారని తెలిపారు. ఇప్పటివరకు జైపూర్‌లోని గాంధీనగర్ రైల్వేస్టేషన్ ఒక్కటే దేశంలో పూర్తిగా మహిళా సిబ్బందితో నడుస్తున్న రైల్వేస్టేషన్‌గా ఉంది.

**రైల్వే ప్రాజెక్టులకు రూ.39,300 కోట్లు..**

తెలంగాణ రాష్ట్రానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రైల్వేల కోసం కేంద్రం రూ.5,337 కోట్లు కేటాయించిందని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. అలాగే రైల్వేల ఆధునీకరణలో భాగంగా రూ.39,300 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో 1,096 కిలోమీటర్ల ఎలక్ట్రిఫికేషన్ పనులు చేపట్టినట్లు వివరించారు. 753 కిలోమీటర్ల మేర కొత్త ట్రాక్‌లు నిర్మిస్తామని, 453 ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణం పూర్తిచేశామని వెల్లడించారు. సికింద్రాబాద్ నుంచి తెలంగాణలో ఏడు జిల్లాలను కలుపుతూ 9 స్టాప్‌లతో 5 వందేభారత్ రైళ్లను నడుపుతున్నట్లు తెలిపారు. రూ.715 కోట్లతో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మాదిరిగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు కిషన్‌రెడ్డి చెప్పారు. రూ.327 కోట్లతో నాంపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు కూడా త్వరలో చేపట్టనున్నట్లు ప్రకటించారు. అన్ని రైల్వేస్టేషన్లలో ఉచిత వైఫై సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఏబీసీడీలు కూడా తెలియకుండా కేంద్రంపై యుద్ధం చేయాలంటే ఎలా? అంటూ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు కిషన్‌రెడ్డి చురకలంటించారు. గతంలో లాగా రెచ్చగొడితే ప్రజలు ఊరుకోరని, చైతన్యవంతులు అయ్యారని పేర్కొన్నారు. డీ లిమిటేషన్ వల్ల సీట్లు తగ్గుతాయని ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు.

# మరోసారి నేనే సీఎం : రేవంత్

వ్యక్తం చేశారు. విశ్రాంత ఉద్యోగుల బకాయిలను త్వరలో చెల్లిస్తామని చెప్పారు. ఆదాయాన్ని పెంచి పేదలకు పంచడమే తమ విధానమని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి రెండుసార్లు మాత్రమే వచ్చారని, కానీ ప్రతిపక్ష నేతగా ఆయన తీసుకున్న జీతభత్యాలు రూ. 57,84,124 అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. 2023 డిసెంబర్ నుంచి 2025 ఫిబ్రవరి వరకు దాదాపు పదిహేను నెలల పాటు జీతభత్యాలు తీసుకున్నారని తెలిపారు. శాసనసభ్యులు కూడా ప్రభుత్వ ఉద్యోగులేనని సుప్రీంకోర్టు తెలిపిందని గుర్తు చేశారు. లక్షల రూపాయల జీతం తీసుకొని రెండు రోజులు మాత్రమే సభకు రావడాన్ని ఆయన తప్పుబట్టారు. నియోజకవర్గ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో ఎక్కడా పర్యటనలకు కూడా వెళ్లలేదని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజా సమస్యలపై చట్టసభల్లో ప్రస్తావించిన సందర్భాలు కూడా లేవన్నారు. కరోనా సమయంలో ఇంటి నుంచి పని చేసేందుకు వెసులుబాటు ఉండేదని, కానీ ఇప్పుడు అది కూడా లేదని ఎద్దేవా చేశారు. రాజకీయాల్లో వర్క్ ఫ్రమ్ హెూమ్, వర్క్ ఫ్రమ్ ఫాం హౌస్ ఏమైనా ఉందా? అని చురక అంటించారు.

# 45 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను జగన్ వారసత్వంగా ఇచ్చి వెళ్లారు: సీఎం చంద్రబాబు

తెలిపారు. ఇలాంటివన్నీ దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రజలకు ఉచితంగా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. స్వర్ణాంధ్ర-2047 పేరుతో స్పష్టమైన విధానం తీసుకువచ్చామని... అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనతో ముందుకు వెళుతున్నామని వెల్లడించారు. రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం పెంచేందుకు కృషి చేస్తున్నామని చంద్రబాబు వివరించారు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఏపీ అన్ని విధాలా విధ్వంసానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం విపరీతంగా అప్పులు చేసి వెళ్లిందని, ఇప్పుడా అప్పులు తీర్చడంతో పాటు వడ్డీ కూడా కట్టాల్సి వస్తోందని తెలిపారు.

# ఇది జగన్మాత ఆదేశం: పవన్‌కల్యాణ్

**ఉత్తరాన పరమశివుని కైలాసం ఉందన్న పవన్ కల్యాణ్**

**కైలాసం, మురుగన్ వెలిసిన ప్రదేశమే భారతదేశమన్న జనసేనాని**

**సోషల్ మీడియాలో ఆసక్తికర స్పందన**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆసక్తికర ట్వీట్ చేశారు. ఉత్తరాదిన ఉన్న హిమాలయాలలో పరమశివుని కైలాసం ఉందని, దక్షిణాదిన ఆయన కుమారుడు మురుగన్ నివాసం ఉందని, వారు వెలిసిన ప్రదేశమే ఈ భారతదేశమని పేర్కొన్నారు. ఇది జగన్మాత ఆదేశమంటూ 'ఎక్స్' వేదికగా రాసుకొచ్చారు. పవన్ నిన్న జనసేన ఆవిర్భావ సభలో హిందీ భాష నేపథ్యంలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీయడం, ప్రకాశ్ రాజ్ కౌంటర్లు వేయడం, బీజేపీ నేతలు పవన్ కు మద్దతుగా వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఈ క్రమంలో పవన్ చేసిన తాజా ట్వీట్ ప్రాధాన్యత సంతరించుకుంది.

# కుటుంబాన్ని, పిల్లల్ని తిట్టారని రేవంత్ బాధపడుతున్నారు... కానీ...!: కవిత

**భారతదేశంలో కర్మ సిద్ధాంతాన్ని బలంగా నమ్ముతామన్న కవిత**

**రేవంత్ రెడ్డి చేసిందే ఆయనకు తిరిగి వచ్చిందని వ్యాఖ్య**

**కేసీఆర్ మీద చేసిన వ్యాఖ్యలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్**


తనను, తన కుటుంబాన్ని, తన పిల్లలను తిట్టారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో బాధపడ్డారని, కానీ గత ఐదారేళ్లుగా వారు చేసిన పనే ఈరోజు ఆయన మీదకు తిరిగి వెళ్లిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. భారతదేశంలో కర్మ సిద్ధాంతాన్ని బలంగా నమ్ముతామని, మనం చేసింది మనకు తిరిగి వస్తుందని భావిస్తుంటామని పేర్కొన్నారు. అందుకే రేవంత్ రెడ్డి చేసింది ఆయనకు వాపస్ (తిరిగి) వచ్చిందని పేర్కొన్నారు. ఆయన మొదలుపెట్టిన విష సంస్కృతి తిరిగి ఆయన మెడకే చుట్టుకుందని ఆమె అన్నారు. తద్వారా, మనం ఏది చేస్తామో అదే తిరిగి వస్తుందని ముఖ్యమంత్రి విషయం ద్వారా మనకు రుజువైందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యులం హుందాగా ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. అందుకే, కేసీఆర్ మీద చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, ఆ తర్వాత మాట్లాడదామని చెప్పామని వెల్లడించారు. కానీ అందుకు ముఖ్యమంత్రి అంగీకరించలేదని ఆయన తెలిపారు. ఇద్దరు జర్నలిస్టులను అరెస్టు చేశారని, కానీ రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు ఎలా ఉన్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. 'ఎవరైనా సరే నేను బట్టలూడదీసి బజారులో ఊరేగిస్తా'నని రేవంత్ రెడ్డి మాట్లాడిన ఈ రోజు చరిత్రలో బ్లాక్ డే అని ఆమె అన్నారు. తన కుటుంబాన్ని తిడుతున్నారని చెబుతూనే, ఆయన ప్రయోగిస్తున్న భాష సరిగ్గా లేదని అన్నారు. యథా రాజా తథా ప్రజ కాబట్టి మీరు మాటలు మాట్లాడటం ఆపివేయాలని సూచించారు. శాసనమండలిలో గవర్నర్ ప్రసంగ తీర్మానానికి ధన్యవాదాలు చెప్పడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండలికి వచ్చారని చెప్పారు. ఆ సమయంలో, కేసీఆర్ మీద చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ సభ్యులం ఆయనను డిమాండ్ చేశామని తెలిపారు. కానీ మండలిలో ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారికి కూడా కనీసం మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. కేసీఆర్ మీద మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకొని సీఎం రేవంత్ రెడ్డి తన హుందాతనాన్ని పెంచుకోవాలని హితవు పలికారు.

# ఏపీ నిర్మించ తలపెట్టిన ఆ పథకానికి కేంద్రం పర్యావరణ అనుమతులు నిరాకరించింది: ఉత్తమ్

**ఇది కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన విజయమన్న ఉత్తమ్**

**ఈ అంశంపై కేంద్రాన్ని పలుమార్లు కలిసి ఫిర్యాదు చేసినట్లు వెల్లడి**

**తెలంగాణలో కీలక సమయంలో అధికారంలోకి వచ్చాం: ఉత్తమ్**



ఆంధ్రప్రదేశ్ నిర్మించ తలపెట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకానికి కేంద్ర ప్రభుత్వం పర్యావరణ అనుమతులను నిరాకరించిందని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన విజయమని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కృష్ణా జలాలతో ఆంధ్రప్రదేశ్ రాయలసీమ ఎత్తిపోతలను నిర్మించాలని భావించిందని ఆయన అన్నారు. అయితే, అంతర్ రాష్ట్ర నిబంధనలను ఉల్లంఘించి ఏపీ ప్రభుత్వం నిర్మాణం చేపట్టిందంటూ పలుమార్లు కేంద్రానికి ఫిర్యాదులు చేశామని మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల ముఖ్య కార్యదర్శి రాహల్ బొజ్జా కేంద్రానికి లేఖ రాశారని గుర్తు చేశారు. కేఆర్ఎంబీ, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండా ఈ ప్రాజెక్టు నిర్మించాలన్నది ఆంధ్రప్రదేశ్ లక్ష్యమని అన్నారు. పర్యావరణ చట్టాలకు విరుద్ధంగా ఈ ప్రాజెక్టును ప్రారంభించారని పేర్కొన్నారు. తెలంగాణలో కీలక సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆయన అన్నారు. కృష్ణా జలాల్లో వాటాను కాపాడుకోవడానికి చర్యలు తీసుకుందని చెప్పారు. కేంద్ర పర్యావరణ శాఖ మంత్రితో వ్యక్తిగతంగా మాట్లాడి సమగ్రంగా వివరించినట్లు చెప్పారు. ఫిబ్రవరి 27న జరిగిన 25వ సమావేశంలో ఎన్జీటీ ఉత్తర్వులను సమీక్షించి నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారించిందని తెలిపారు. కృష్ణా జలాశయాల్లో తెలంగాణ హక్కు కోల్పోకుండా చూడటంతో పాటు విధానపరమైన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.



## ఆస్తిపన్ను బకాయిదారులపై మునిసిపల్ అధికారుల దాడులు

## 15 షాపులు, రిలయన్స్ పెట్రోల్ బంకు సీలు

మిర్యాలగూడ , మార్చి 15:- (వార్త మిర్రర్) ఆస్తిపన్ను మొండి బకాయిదారులపై మునిసిపల్ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. మొండి బకాయిదారులైన రిలయన్స్ పెట్రోల్ బంకు, దుకాణాలను శనివారం మునిసిపల్ అధికారులు, సిబ్బంది సీలు వేశారు. హనుమాన్ పేటలోని రిలయన్స్ పెట్రోల్ బంకు యాజమాన్యం రూ. 1.10,5000లు బకాయి ఉన్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమీషనర్ ఎండి.యూసుఫ్ మాట్లాడుతూ రెడ్ జోన్ లో 100 దుకాణ, పెట్రోల్ బంకు యజమానులకు రెడ్ నోటీసు జారీ చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం సీలు వేసిన ఎస్బిఐ కాంప్లెక్స్ లోని 15 షాపులు, బంకుల యజమానులు ఈ నెల 31లోగా రూ.13,23,550లు బకాయిలు ఉండగా కఠిన చర్యలు తీసుకున్నామని ఆయన అన్నారు. సోమవారం లోగా 100 షాపుల యజమానులు ఆస్తిపన్ను చెల్లించకుండా ఉంటే సీలు వేస్తామని ఆయన అన్నారు.



## శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే బిఎల్ఆర్

మిర్యాలగూడ , మార్చి 15:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గం వేములపల్లి మండలం అమనగల్లు ప్రసిద్ధి చెందిన శ్రీ శ్రీ పార్వతీ రామలింగేశ్వర స్వామి జాతర మహోత్సవంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జాతర సందర్భంగా ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభించి క్రీడాకారులతో కలసి కబడ్డీ ఆడారు. అనంతరం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యమాల్లో పాల్గొన్నారు. స్థానిక నాయకులు, భక్తులతో కలసి డాన్స్ చేయడం జరిగింది. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో మిర్యాలగూడ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు..



## వై టి పి ఎస్ నిర్మాణంలో ఇల్లు కోల్పోయిన గ్రామాల బాధితులకు త్వరలో ఉద్యోగాలు

మిర్యాలగూడ , మార్చి 15:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ శాసనసభ నియోజకవర్గం దామరచర్ల మండలం యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన కపురతండా, మోదుగులకుంట గ్రామాలలోని ఆర్ అండ్ ఆర్ బాధితులను ఉద్యోగాలలో త్వరలో భర్తీ చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ తెలిపారు. బాధితుల సమస్యల గురించి ఎమ్మెల్యే బిఎల్ఆర్ బాధితులను తీసుకొని హైదరాబాద్ ప్రజాభవన్ లో శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైటిపిఎస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ సుల్తానియా ను కలిసి సమస్యలు విన్నవించారు. వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ఉద్యోగా నియామకాల తేదీని ఖరారు చేసి ప్రతీ ఒక్క బాధితుడికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తామని హామీ ఇచ్చారు.



## ఆస్తి పన్ను చెల్లించని మొండి బకాయిదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

### సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్

మిర్యాలగూడ మార్చి 14:- (వార్త మిర్రర్)ఆస్తిపన్ను చెల్లించని వారిపై విద్యుత్, నీటిసరఫరా నిలిపి వేయడం చట్టపర చర్యలు తీసుకుంటామని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. మొండి బకాయి దారుల ఆస్తులు కూడ జప్తు చేస్తామని ఆయన అన్నారు. మిర్యాలగూడ మునిసిపల్ పరిధిలో సుమారు 100 మంది ఆస్తి పన్ను మొండి బకాయి దారులు రెడ్ జోన్ లో ఉన్నారని వారు తక్షణమే. చెల్లించకుంటే కఠిన చర్యలు జప్తులు, నల్లా కనెక్షన్ కట్, విద్యుత్ సరఫరా కట్ తప్పదని ఆయన అన్నారు. ఎవరికీ ఎలాంటి మినహాయింపులు, సిఫార్సులు అంగీకరించకుండా పన్నుల వసూలు ప్రక్రియ నిరంతరం కొనసాగించాలని కమీషనర్ ను ఆదేశించారు. ఎలాంటి కాలయాపన చేయకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# కుష్టు వ్యాధి శాపం కాదు కోటి మనుషుల మానవత్వంతో ఆదరించాలి

**రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి**

**సమాజంలో నిరాదరణకు గురవుతున్న కుష్టు వ్యాధిగ్రస్తులకు ఆత్మస్థైర్యాన్ని కల్పించాలి-డాక్టర్ బి జాన్ బాబు**






పెద్ద అంబర్ పేట వార్త మిర్రర్ ప్రతినిధి

పెద్ద అంబర్ పేటలో 525 కుష్టు వ్యాధిగ్రస్తుల కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి, పురపాలిక కమిషనర్ రవీందర్ రెడ్డి, వార్డు మాజీ కౌన్సిలర్ విద్యావతి విజేందర్రెడ్డి, రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవితో కలిసి నిత్యవసర సరుకులు అందజేస్తున్న ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ లెప్రసీ విభాగం రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్ బాబు, పెద్ద అంబర్పేట్ లో జరిగిన కార్యక్రమంలో నిత్యావసర సరుకులు అందుకున్న లబ్ధిదారులుపెద్ద అంబర్ పేట: కుష్టు వ్యాధి శాపము, పాపము కాదని, వారిని తోటి మనుషుల్లా మానవత్వంతో ఆదరించాలని రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి కోరారు. రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్ పేటలో రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ లెప్రసీ విభాగం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్ బాబు, పురపాలిక కమిషనర్ రవీందర్ రెడ్డి, వార్డు మాజీ కౌన్సిలర్ విద్యావతి విజయేందర్ రెడ్డి లతో కలిసి హైదరాబాదు మహానగరంలోని 13 కుష్టు వ్యాధిగ్రస్తుల కాలనీలకు చెందిన 525 కుటుంబాలకు రూ. 8 లక్షలు విలువైన నిత్యావసర సరుకులు, దుప్పట్లు, నూతన వస్త్రాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ, మనలాగే మన పొరుగు వారిని ఆదరించాలని, సంపాదించిన దాంట్లో కొంత ఆపన్నులకు అందించాలని రిలయబుల్ ట్రస్టును స్థాపించి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. నల్గొండ, వరంగల్, కొత్తగూడెం, కామారెడ్డి, నిజామాబాద్ ప్రాంతాల్లోని కుష్టు వ్యాధిగ్రస్తుల కుటుంబాలకు, కండరాల క్షీణత వ్యాధి బాధితులకు, అనాధ, మానసిక వికలాంగుల ఆశ్రమాలకు నిత్యావసర సరుకులను, దుప్పట్లు, వస్త్రాలను అందించామని వివరించారు. కరోనా కష్ట కాలంలో ఉపాధి కోల్పోయిన వేలమంది పేదల ఆకలి తీర్చామని వివరించారు. మనం పొరుగువారికి సహాయ పడితే, దేవుడు మనల్ని ఆశీర్వదిస్తాడని వెల్లడించారు. డాక్టర్ డి. జాన్ బాబు మాట్లాడుతూ, సమాజంలో నిరాదరణకు గురవుతున్న కుష్టు వ్యాధి గ్రస్తులకు ఆత్మస్థైర్యాన్ని కల్పించి, వారు ఆరోగ్యంగా, ఆనందంగా జీవించేందుకు సహకారం అందిస్తున్న రిలయబుల్ ట్రస్టును అభినందించారు. ఎస్. ఎల్. ఏ. పి. రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, హిందూ మిత్ర యువజన విభాగం అధ్యక్షుడు పులి రాజు, సామాజిక కార్యకర్త పసుల రఘుపతి, ఇటికల మహేందర్ రెడ్డి, వద్దేపల్లి ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సీఎం దిష్టిబొమ్మ దగ్ధం

**కెసిఆర్ అవమానపరిచే విధంగా మాట్లాడితే తగిన మూల్యం చెల్లించక తప్పదు ఎమ్మెల్యే మర్రి**



వార్త మిర్రర్, మల్కాజ్ గిరి:తెలంగాణ రాష్ట్ర సాధకుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ని గాని పార్టీ నాయకులు గానీ తెలంగాణ సమాజాన్ని అవమానపరిచే విధంగా మాట్లాడితే తగిన విధంగా బుద్ధి చెప్తామని బి ఆర్ ఎస్ మల్కాజ్గిరి ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో వారి సూచన మేరకు జేఏసీ వెంకన్న,రామచర్ల నర్సింగ్ ఆధ్వర్యంలో మల్కాజ్గిరి చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను వ్యర్థం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కెసిఆర్ ని అనుచిత వ్యాఖ్యలతో అవమానపరిచే విధంగా కేసీఆర్ చావును కోరుకునే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగజారుడు రాజకీయాలతో తెలంగాణ ఆస్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడుతున్నారని తెలిపారు. కేసీఆర్ మరణాన్ని కోరుకునే విధంగా చేస్తున్న కామెంట్లకు నిరసనగా భారీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తెలంగాణ రాష్ట్రం కోసం హర్నిశలు తపించి రాష్ట్రాన్ని సాధించిన నాయకున్ని తులనాడే విధంగా మాట్లాడడం అవమానకరమని ముఖ్యమంత్రి మాటలను తెలంగాణ సమాజం సహించదని తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా పాలన ఉండాలే తప్ప ఈ విధంగా వ్యక్తిగత దూషణలతో రాజకీయం చేయడం సిగ్గుచేటు అన్నారు. ఈ సందర్భంగా దిష్టిబొంగ దగ్ధం చేయనికుండా అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా చిన్న తోపులాట జరిగింది. ఆ తర్వాత టిఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి సొంత పూచి కత్తిపై విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సునీత రాము యాదవ్, రావుల అంజయ్య, బద్దం పరశురాం రెడ్డి, జగదీష్ గౌడ్, మురుగేష్, రాము యాదవ్, ఉస్మాన్, భాగ్యానందరావు, చిన్న యాదవ్, నర్సింగ్ రావు, బైరు అనిల్, శ్రీనివాస్ రెడ్డి, సిద్ధిరాములు, శోభ,రాధిక, ఉపేందర్, బాబురావు, శివ గౌడ్, సాయి గౌడ్, మల్లేష్ యాదవ్, శంకర్, సుమన్, నవాబ్, మారుతి, సంతోష్ గుప్తా, మురళి నాయుడు, సంతోష్ నాయుడు, గడ్డమీది రాజు, శ్రీనివాస్ రెడ్డి, రమ, శ్రీలత, హంస వేణి తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి సస్పెన్షన్ ను ఎత్తివేయాలని భువనగిరిలో నిరసన

**ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు-చింతల వెంకటేశ్వర్ రెడ్డి**

**రైతు సమస్యలపై మాట్లాడితే సస్పెన్షన్ చేయడం నిరంకుశత్వానికి నిదర్శనం-జనగం పాండు**

**ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం-డాక్టర్ ర్యాకల శ్రీనివాస్**





యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి గణేష్ సాగర్ ప్రభుత్వ అసమర్ధతను అసెంబ్లీ వేదికగా ప్రశ్నించిన మాజీమంత్రి సూర్యాపేట శాసనసభ్యుడు, జగదీష్ రెడ్డి ని సమావేశాల నుంచి సస్పెండ్ చేయడం తో భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రెసిడెంట్ కెసిఆర్ ఆదేశాల మేరకు. భువనగిరి పట్టణ కేంద్రంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, భువనగిరి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జనగాం పాండు ఆధ్వర్యంలో భువనగిరి పట్టణ కేంద్రంలో భారీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. చింతల వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్ధతను అసెంబ్లీ వేదికగా ప్రశ్నించిన మాజీమంత్రి సూర్యాపేట శాసనసభ్యులు జగదీశ్వర్ రెడ్డిని సమావేశాల నుంచి సస్పెండ్ చేయడం సిగ్గుచేటు అని అన్నారు. ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి సస్పెన్షన్ ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.మండల అధ్యక్షులు జనగాం పాండు మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై ఓ రైతుగా అసెంబ్లీలో పోరాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డిని సస్పెండ్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం అన్నారు ప్రజా క్షేత్రంలోకీ రేవంత్ రెడ్డి వస్తే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని అన్నారు, బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు అమలుపరిచిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందజేయాలని డిమాండ్ చేశారు. అబద్దాల హామీలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి అసెంబ్లీ కూడా నిర్వహించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ నాయకులు ఓం ప్రకాష్ గౌడ్,భువనగిరి పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కిరణ్, మాజీ రైతు బంధు సమితి భువనగిరి జిల్లా అధ్యక్షులు కొలువుల అమరేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్ బిఆర్ఎస్ జిల్లా నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు బాత్క అశోక్ యాదవ్, నిరసన కార్యక్రమంలో భారీగా పాల్గొన్నారు



## ఆస్తిపన్ను వడ్డీలో 90 శాతం వడ్డీ రాయితీ ఇవ్వాలి

### సీపీఎం డిమాండ్

మిర్యాలగూడ మార్చి 15:-( వార్త మిర్రర్)

మున్సిపల్ ఆస్తిపన్నులో వడ్డీ మాఫీ ఇవ్వాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ డబ్బికార్ మల్లేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది మార్చి నెలలో ఆస్తిపన్ను వసూలను వేగవంతం చేస్తుందని ఆ సమయంలో వడ్డీ రాయితీ ఇస్తూ పేద మధ్యతరగతి ప్రజలకు వెసులుబాటు కల్పిస్తుందని చెప్పారు ప్రస్తుతం జిహెచ్ఎంసి లో వడ్డీ పై 90 శాతం మాఫీ ఇచ్చారని రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీలలో వడ్డీ మాఫీ ఇవ్వడం లేదని చెప్పారు. ఆస్తి పన్ను వసూలు కోసం మున్సిపల్ అధికారులు బలవంతం చేస్తున్నారని దీనివల్ల పేద మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తి పన్ను వడ్డీలో 90 శాతం రాయితీ ఇచ్చినట్లయితే ఎక్కువ మంది ప్రజలు ఆస్తి పన్ను చెల్లింపుకు ముందుకు వస్తారని తెలిపారు గతంలో వడ్డీ రాయితీ ఇవ్వడం వలననే పెద్ద మొత్తంలో ఆస్తి పన్ను వసూలు అయిందని గుర్తు చేశారు ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున దీనిపై చర్చించి రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీలలో ఆస్తిపన్నుపై వడ్డీ రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు రవినాయక్, డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, ఆర్.పరశురాములు, తిరుపతి రామ్మూర్తి, లక్ష్మీ నారాయణ, బాషా పాల్గొన్నారు.



## సినీ దర్శకుడు డాక్టర్ పిసి ఆదిత్యకు మహాత్మా గాంధీ స్మారక పురస్కారం

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి..( సంగిశెట్టి ధనుంజయ్ నేత ) ..మార్చి : 15 ...నిత్య ప్రయోగశిలి విలక్షణ దర్శకుడు డాక్టర్ పి సి ఆదిత్యను మరో అత్యున్నత పురస్కారం వరించింది. భువనేశ్వర్ ఒడిస్సాకు చెందిన ప్రముఖ సేవా సంస్కృతిక సంస్థ ఫేమస్ పీపుల్ ఇండియా వారు దర్శకుడు పిసి ఆదిత్యను ప్రముఖ వ్యక్తిగా గుర్తించి మహాత్మా గాంధీ స్మారక విశిష్ట వ్యక్తిగా అవార్డును ప్రకటించారు. గురువారం ఈ విశిష్ట పురస్కారాన్ని తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్, టిపిసిసి ప్రచార కమిటీ కో-కన్వీనర్ ప్రముఖ సంఘ సేవకులు ఉప్పల శ్రీనివాసగుప్తా తన నివాసంలో ఆదిత్య సత్కరించి మహాత్మా గాంధీ స్మారక పురస్కారం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసగుప్తా మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా సినీ రంగంలో ఎన్నో ప్రయోగాత్మక చిత్రాలు రూపొందించి ఎందరో నూతన కళాకారులను ప్రోత్సహిస్తున్నటువంటి ఆదిత్య సినీ రంగానికి మరిన్ని సేవలు అందించి ఎన్నో అవార్డులు అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ విశిష్ట పురస్కారం అందుకున్న ఆదిత్య స్పందిస్తూ నా ఆ విశ్రాంతి సినీ ప్రయాణంలో మరి కొంతమంది నూతన నటీనటులను, సాంకేతిక నిపుణులను ప్రోత్సహిస్తానని అన్నారు

# అసెంబ్లీలోఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి సస్పెన్షన్ అప్రజాస్వామికం

## రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ ను దహనం చేసిన బి ఆర్ఎస్ నాయకులు



సంస్థాన్ నారాయణపూర్ మార్చి 15:( వార్త మిర్రర్)నారాయణపూర్ మండల కేంద్రంలోనిప్రభుత్వ అసమర్థతను అసెంబ్లీ వేదికగా ప్రశ్నించిన మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యుడు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని సమావేశాలను నుంచి సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని బీఆర్ఎస్ నారాయణపూర్ మండల అధ్యక్షుడు నర్రి నరసింహ అధ్యక్షత ధర్నా కార్యక్రమంలో తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్యఅతిథిగా సుర్వి యాదయ్య గౌడ్ పాల్గొని మాట్లాడుతూ జగదీశ్ రెడ్డి సస్పెన్షన్‌ను తీవ్రంగా నిరసిస్తూ భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెసిఆర్ ఆదేశాల మేరకు శనివారం నారాయణపురం మండల కేంద్రంలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది. రైతాంగ సమస్యలపై ఓ రైతుగా అసెంబ్లీలో పోరాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం అన్నారు. ప్రజాక్షేత్రంలోకి రేవంత్ రెడ్డి వస్తే ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సస్పెన్షన్‌కు భయపడేది లేదని ప్రజాక్షేత్రంలో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కొట్లాడుతామన్నారు.తదనంతరం కోతులపురం గ్రామంలో మొదటి విడుతలో ఇందిరమ్మ ఇండ్లుకు అరువురాలైన నోముల శివాని భర్త సుకుమార్ గ్రామ సభలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రం అందజేసి ఇపుడు ఇండ్లు కట్టుకోవడానికి అధికారులను కలువగ మి యొక్క ఇండ్లు రద్దు చేశారు అని చెపుతున్నారు కావున మండలంలో నిజమైన అరుపులకు ఇండ్లు మంజూరు చేయాలని బి ఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందిస్తూ లేని యెడల మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతాయి అని హెచ్చరించడం జరిగింది ఈ కార్యక్రమంలో, డిసిసిబి మాజీ డైరెక్టర్ గడ్డం మురళీధర్ రెడ్డి , జిల్లా నాయకులు జక్కిడి ధన్వంత్ రెడ్డి, శివరాత్రి విద్య సాగర్, బి ఆర్ ఎస్ వి మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు నలపరాజు రమేష్, మాజీ సర్పంచులు మైల యాదవ రెడ్డి, కట్టెల బిక్షపతి, మన్నె చిత్రసేనారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు తెలంగాణ బిక్షం, లారీ బిక్షం, తిరుమలేశ్, వీరమాళ్ల జంగయ్య, గంగాదేవి సత్తయ్య, వడ్డేపల్లి గలయ్యా, శ్రీనివాస్, రాసల వెంకటేష్, యువజన నాయకులు రాచకొండ గిరి, జక్కిడి యాదిరెడ్డి, బోయ శ్రీరాములు, బి ఆర్ ఎస్ వి మండల అధ్యక్షుడు పగిల్ల శ్రీకాంత్ , బి ఆర్ ఎస్ వి మునుగోడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గుమ్మాల ప్రవీణ్, నోముల సుకుమార్, ఏర్పుల లింగస్వామి గుండు లింగన్న గౌడ్ సుర్వి లింగస్వామి మహేందర్, చిలివెరు శంకర్, సిరిపంగి గలయ్య, ఎల్లయ్య, పక్కిర్, తదితరలున్నారు



## ఎల్ఆర్ఎస్ పూర్తి అయిన వెంటనే ధ్రువీకరణ పత్రాలు

మిర్యాలగూడ మార్చి 15:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ మునిసిపల్ పరిధిలో లే ఔట్ క్రమబద్ధికరణ పధకం(ఎల్ఆర్ఎస్) కింద వెను వెంటనే ధ్రువీకారణ పత్రాలు అందిస్తున్నామని స్థానిక మునిసిపల్ కమీషనర్ ఎండి.యూసుఫ్ తెలిపారు. శనివారం ఎల్ఆర్ఎస్ దరఖాస్తు దారుడు 25శాతం రాయితీ పొందుతూ క్రమబద్ధికరించిన అనంతరం ధ్రువీకరణ పత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 31లోగా ఎల్ఆర్ఎస్ రాయితీ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



## అతిధుల కోలాహలం మధ్య బాత్క ప్రాణవ్ యాదవ్ జన్మదిన వేడుకలు

### జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి గణేష్ సాగర్

భవనగిరి మండలం అనాజీపురం గ్రామ శాఖ అధ్యక్షులు బత్క అశోక్ యాదవ్, తమ్ముడు బత్క నవీన్ యాదవ్ కుమారుడు ప్రాణవ్ యాదవ్ జన్మదిన వేడుకల కార్యక్రమానికి బిఆర్ఎస్ జిల్లా నాయకులు, సామాజికవేత్త, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ హాజరై ప్రణవ్ యాదవ్ ని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అనాజీపురం గ్రామ బిఆర్ఎస్ నాయకులు బొల్లెపల్లి అరవింద్, నీలం సుదర్శన్, శివ కుమార్, శివ కుమార్ పాల్గొన్నారు



## ఆటోలో తరలిస్తున్న పిడిఎస్ బియ్యం పట్టివేత

మిర్యాలగూడ మార్చి 15:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నందిపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఒక ఆటో నెంబర్ ఎపి 27 టివై 2316 అను నెంబర్ గల ఆటోలో అక్రమంగా సుమారు 3 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం తరలిసస్తుండగా ఆటోని పట్టుకుని ఆటో డ్రైవర్ ను విచారించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పిడుగురాళ్లకు చెందిన వాడినని తెలిపి తాను వాటర్ ట్యాంక్ తండా చుట్టుపక్కల వివిధ గ్రామాలలో తెల్ల రేషన్ కార్డుదారుల నుండి తక్కువ ధరకు కొని ఎక్కువ ధరకు అమ్ముకొనుటకు గాను తన ఆటోలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారని ఒప్పుకున్నాడు. అనంతరం పిడిఎస్ బియ్యం ఆటోను పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేశారు.



## అధైర్య పడొద్దు అండగా నేనుంటాను.

### - ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి

కల్వకుర్తి మార్చ్ 15 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందినకాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు అయితపాగ సంతోష్ కుమార్ తండ్రిఅయితపాగ కృష్ణయ్య శనివారం ఉదయం గుండెపోటుతో మరణించారు.ఈ విషయం తెలుసుకున్న వెంటనే ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,టాస్క్ -సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళు లర్పించి,ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అధైర్య పడవద్దు అండగా నేను ఉంటానని భవిష్యత్తులో అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ పార్టీ కార్యదర్శి అనిల్ గౌడ్ లతో పాటు సీనియర్ నాయకులు రచ్చ శ్రీరాములు పాల్గొన్నారు.

## ఈనెల 16నుంచి 23వరకు భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగాభగత్ సింగ్ స్మారక విద్యార్థి, యువజన ఉత్సవాలను జయప్రదం చేయండి.

### ఎస్ ఎఫ్ ఐ, డి వై ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శులు మల్లం మహేష్, ఖమ్మంపాటి శంకర్...



నల్గొండ జిల్లా వార్త మిర్రర్ ప్రతినిధి...నల్లగొండ జిల్లాలోని దొడ్డి కోమరయ్య భవనంలో విద్యార్థి యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమావేశం నిర్వహించడం జరిగింది. అనంతరం డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మం పాటి శంకర్ మాట్లాడుతూ మార్చ్ 16 నుంచి 23 వరకు నల్గొండ జిల్లా వ్యాప్తంగా నిర్వహించే భగత్ సింగ్ స్మారక ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. రవి అస్తమించిన బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన భగత్ సింగ్ త్యాగాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారం చేయడానికి జంకుతున్నాయని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన యోధుడు భగత్ సింగ్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గల్లి స్థాయిలో కూడా త్యాగాలు చేయని వాళ్లను ఢిల్లీ స్థాయిలో ప్రచారం చేస్తున్నాయి పాలక ప్రభుత్వాలు భగత్ సింగ్ జీవిత చరిత్ర పాఠ్యపుస్తకాల నుంచి పూర్తిగా తొలగించేందుకు బిజెపి ప్రభుత్వం కంకణం కట్టుకుందని అన్నారు. నేటి సమాజంలో విద్యార్థులు యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ముఖ్యంగా గంజయ్,డ్రగ్స్ మాదక ద్రవ్యాలకు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. భగత్ సింగ్ స్ఫూర్తితో భగత్ సింగ్ చేసిన త్యాగంతో విద్యార్థులు, యువకులు ముందుకు పోవాలని కోరారు. భగత్ సింగ్ ను చంపగలిగారేగాని అతని ఆశయాలను చంపలేరని భగత్సింగ్ ఆశయ సాధన కోసం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ) భగత్ సింగ్ ఆశయాలను విద్యార్థుల్లో కీ, యువకుల్లోకి తీసుకెళ్ళడం కోసం భగత్ సింగ్ ఈ దేశ స్వతంత్రం కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా పెట్టి తన జీవితాన్ని అర్పించడం జరిగింది. అందుకే ఒక వీరుని మరణం వేల గొంతులో విప్లవ నినాదం గర్జిస్తూ భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవ్ ఆశయ సాధన కోసం విద్యార్థులు యువకులు పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. పాలకులు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలు మరియు యువజన వ్యతిరేక విధానాలపై నిరుద్యోగులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న దివాలా కోరి విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేయడం కోసం ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ పోరాటం చేస్తుందని అన్నారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా జిల్లాలో టూ కె రన్, మాదకద్రవ్యాలకు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రచారం చేస్తూ జిల్లాలో సెమినార్ల ద్వారా మరియు రక్తధాన శిబిరాలను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గుండాల నరేష్, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు పాలది కార్తిక్, ఎస్ఎఫ్ఐ నల్లగొండ డివిజన్ కార్యదర్శి మారుపాక కిరణ్, డివైఎఫ్ఐ నాయకులు పెద్ది రాము, రఘువరన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఫ్యూచర్ సిటిలో కొన్ని గ్రామాలను కలిపేందుకు కృషి చేస్తా మంత్రి శ్రీధర్ బాబు

### అఖిల పక్ష నాయకులతో కలిసి మినిస్టర్ క్వార్టర్స్ కు వచ్చిన కే ఎల్ ఆర్

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి..( సంగిశెట్టి ధనుంజయ్ నేత ) ..మార్చి : 15 ... మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి. శనివారం అఖిలపక్ష నాయకులతో కలిసి అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మినిస్టర్ క్వార్టర్ లో మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ముఖ్యమంత్రి ప్రత్యేక అధికారి శేషాద్రితో సమావేశమ అయ్యారుకందుకూరు మండలంలోని కొన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటిలో కలిపేందుకు గ్రామాల నుంచి వస్తున్న వినతులను మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లారు కేఎల్ఆర్. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ ఈ బడ్జెట్ సమావేశాలలో తప్పకుండా గ్రామస్తుల కోరికను ఫోర్త్ సిటీలో కలపాల్సిన గ్రామాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఫోర్త్ సిటీలో కలిపేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



## సి.గ్రేడు విద్యార్థులకు ఏ.ఐ ద్వారా విద్యాబోధన ప్రారంభం

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) మార్చి 15రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో ఎఫ్.ఎల్.న్ లో సి గ్రేడు వచ్చిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగు పరుచుటకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ని ఉపయోగించి డిజిటల్ టెక్నాలజీ ద్వారా విద్యాబోధన చేయుటలో భాగంగా శనివారం రోజు జగిత్యాల జిల్లా రాయికల్ మండల ప్రజా పరిషథు పాఠశాల ఆలూరు నందు సి. గ్రేడు విద్యార్థులకు ఏ.ఐ ద్వారా విద్యాబోధన ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మెక్కొండ రామి రెడ్డి, విద్యాభివృద్ధి కమిటీ ఛైర్మన్ చిలుక సంజీవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అక్కినపెల్లి సతీష్, ఉపాధ్యాయులు సాయి కృష్ణ, రమేష్ రెడ్డి, శృతి పాల్గొన్నారు.






## రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికైన ప్రగతి విద్యార్థి

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) మార్చి 15

జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలో శుక్రవారం రోజు నిర్వహించబడిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో రాయికల్ పట్టణ కేంద్రంలోని ప్రగతి ఉన్నత పాఠశాలకు చెందిన పస్తం విష్ణు 100 మీటర్ల పరుగు పందెంలో అద్భుత ప్రతిభను కనబరిచి, ఈనెల 23న హైదరాబాదులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా విష్ణును పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్, కరస్పాండెంట్ జయశ్రీ, అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్, పాఠశాల పి.ఈ.టి మహేష్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# మూడు నెలలుగా జీతాలు అందక ఫీల్డ్ అసిస్టెంట్లు అవస్థలు

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) మార్చి 15

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. గత మూడు నెలల నుండి జీతాలు అందకపోవడంతో ముప్పుతిప్పలు పడుతూ... శనివారం రాయికల్ మండల కేంద్రంలో ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు గడపగడప తిరుగుతూ బిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. గత మూడు నెలలుగా జీతాలు లేక కుటుంబాలను పోషించలేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, నిత్యం గ్రామాలలో కూలీలకు పనులపై అవగాహన కల్పిస్తూ పని ప్రదేశంలో కూలీలకు కొలతలు ఇస్తూ మస్టర్లలో పనులకు హాజరైన కూలీల హాజరు వేస్తూ, ఆన్లైన్ లో హాజరు పంపిస్తున్నామని, అయినా మమ్మల్ని పట్టించుకునే నాధుడే లేరని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని వర్గాలకు సంబంధించిన ఉద్యోగులకు మొదటి తారీకున జీతాలు ఇస్తున్న ప్రభుత్వం నిత్యం గ్రామాలలో కూలీలకు పనులు కల్పిస్తూ కూలీల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్న తమకు ఎందుకు జీతాలు నెలనెలా ఇవ్వడం లేదని మనోవేదన చెందుతున్నారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులకు జీతాలు ఇచ్చి ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నిస్తున్నారు. నెలనెలా జీతాలు ఇవ్వకపోవడం వల్ల పిల్లల బడి ఫీజులు చెల్లించక, నిత్యవసర సరుకులు కొనుగోలు చేయడానికి డబ్బులు లేక ఇల్లు గడవటం కూడా చాలా కష్టంగా ఉందని, ప్రభుత్వం మా పరిస్థితిని గమనించి తొందరగా జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధిహామీ పథకంలో అతి తక్కువ వేతనాలతో విధులు నిర్వహిస్తున్న తమకు అసెంబ్లీ



ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో పొందపరిచిన విధంగా పే స్కేల్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించి తమను ఆదుకోవాలని, పెండింగ్ లో ఉన్న జీతాలు తొందరగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ అసోసియేషన్ మండల అధ్యక్షులు భూక్య తిరుపతి, కనికరపు లక్ష్మణ్, మహమ్మద్ నసీర్, మామిడిపెల్లి మహేష్, నర్సయ్య, మల్లేశం, లక్ష్మణ్, ఇందూరి తిరుపతి, శ్రీనివాస్, తిరుపతి, రాజేందర్, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో బలపడుతున్న సిఐటియు

మందమర్రి మార్చి 15: వార్త మిర్రర్ ప్రతినిధి సింగరేణి వ్యాప్తంగా సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూని యన్( సిఐటియు) కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రాజీలేని పోరా టాలతో కార్మికులు యూని యన్ ను ఆదరించి స్వచ్ఛందం గా ముందుకు వచ్చి యూని యన్ లో చేరుతున్నారని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు సాంబారు వెంకటస్వామి, అల్లి రాజేందర్ లు ఆన్నారు. ఏరియాలోని కేకే 5 గనిపై నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య సొంతింటి కళ సాకారంతో పాటు ఇతర కార్మికుల సమస్యల పరిష్కారానికి చేస్తున్న ఆందోళనలు, పోరాటాలతో కార్మికులు పెద్ద ఎత్తున యూనియన్ లో చేరుతున్నారని ఆన్నారు. ముఖ్యంగా అన్నిగనుల్లో యువ కార్మికులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి యూనియన్ చేపడుతున్న ఆందోళన కార్యక్రమాలకు ఆకర్షితులై యూనియన్ లో చేరుతున్నారని కార్మికుల చేరికతో యూనియన్ బలోపేతం అవడమే కాకుండా కార్మికుల హక్కులు డిమాండ్ల సాధన కోసం పోరాటాలు ఆందోళనలు నిర్వహించే గురు తర బాధ్యత యూనియన్ పై ఉందని వారు స్పష్టం చేశారు.కార్మికుల సమస్యలపై ప్రధాన ప్రతిపక్ష పాత్రను సీఐటీయూ పోషిస్తుందని వారు స్పష్టం చేశారు. స్ట్రక్చరల్ సమావేశాలు గత గుర్తింపు సంఘం టిబిజీకేఎస్ హయాంలో నిర్వహించలేదని దీనిపై ఎందుకు ప్రశ్నించలేదని ప్రతిపక్షాలను విమర్శిస్తున్న ఏఐటీయూసీ నాయకులు గతంలో ప్రాతినిధ్య సంఘంగా గెలిచిన 2 ఏరియాల్లో స్ట్రక్చర్డ్ సమావేశాలు ఎందుకు నిర్వహించలేదో ఏఐటియుసి నాయకులు ఆత్మ



విమర్శ చేసుకోవాలనీ వారు హితవు పలికారు. ఏరియాలో జరిగిన స్ట్రక్చర్ సమావేశాలలో చర్చించిన కార్మికుల సమస్య లను వెంటనే పరిష్కరించా లని, పెండింగ్ ప్రమోషన్లను వెంటనే భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. గనులలో జరుగుతున్న ప్రమాదాల తీరుపై అధ్యయనం చేసి భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాల ని కోరారు. ఈ సందర్భంగా గని ఫిట్ సెక్రటరీ సంకె వెంకటేష్ ఆధ్వర్యంలో సూరజ్, నరేందర్ లతో పాటు యువ కార్మికులు యూనియన్ లో చేరగా వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈకార్యక్రమంలోయూనియన్ నాయకులు ఆదర్శ్, విద్యసాగర్ గని కార్మికులు పాల్గొన్నారు.

## జీహెచ్ఎంసీ, జలమండలి ఉద్యోగులకు...

# కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం... కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి





సికింద్రాబాద్, వార్తా మిర్రర్ మార్చి 15 : నగరాభివృద్ధికి తోడ్పడే జీహెచ్ఎంసీ, జలమండలి ఉద్యోగులకు... కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ అంటే కేవలం హైటెక్ సిటీ, మాదాపూర్ మాత్రమే కాదని. సికింద్రాబాద్లో ఉన్నటువంటి బస్తీలు, గౌలిగౌడ, ఖైరతాబాద్లోఉన్న బస్తీలనూ పట్టించుకోవాలన్నారు. ఎ శనివారం రాత్రి శాంతినగర్లో రూ. 18 లక్షల వ్యయంతో కమ్యూనిటీహాల్, రూ. 24.85 లక్షల వ్యయంతో మెట్టుగూడ దూద్బావి వద్ద కమ్యూనిటీ హాల్ అదనపు ఫ్లోర్ ను కిషన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల సంఘాల సమావేశాలు లేదా చిన్న చిన్న ఫంక్షన్లు చేసుకునేందుకు ఉపయోగపడేలా కమ్యూనిటీ హాళ్లు నిర్మింకున్నామన్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ను రూ.720 కోట్లతో అత్యాధునిక ఆధునిక వసతులతో ఆధునీకరించడం జరుగుతోంది. శంషాబాద్ ఎయిర్ పోర్టు తరహాలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ను తీర్చిదిద్దుతున్నాం. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వేటర్మినల్ లకు తోడుగా ఇటీవలే చర్లపల్లిలో కొత్త రైల్వే టర్మినల్ ను ప్రారంభించామన్నారు. బేగంపేట రైల్వేస్టేషన్ ను ఆధునీకరణ పనులను పరిశీలించాం. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయి. వచ్చే రెండు నెలల్లో బేగంపేట రైల్వేస్టేషన్ ను ఆధునిక వసతులతో తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. హైదరాబాద్ నగరంలో రోడ్లు, స్ట్రీట్ లైట్స్, పార్కులు, డ్రైనేజీ వ్యవస్థ. తాగునీటి సౌకర్యం వంటి పనులను చేసి, ప్రజలకు సౌకర్యాలు మెరుగుపర్చాల్సిన జీహెచ్ఎంసీ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ సంస్థలు కనీసం ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి వచ్చాయి. నిధుల కొరతతో పౌర సౌకర్యాలు మెరుగుపర్చలేని స్థితిలో ఉన్నాయి. దురదృష్టవశాత్తు హైదరాబాద్ లో చిన్న చిన్నపనులకు టెండర్లు పిలిస్తే కాంట్రాక్టర్లు ముందుకు రాలేని పరిస్థితి ఎదురైంది. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ అంటే కేవలం హైటెక్ సిటీ, మాదాపూర్ మాత్రమే కాదనేది గుర్తెరగాలి. సికింద్రాబాద్ లో ఉన్నటువంటి బస్తీలు, గౌలిగౌడ, ఖైరతాబాద్ లో ఉన్న బస్తీలనూ పట్టించుకోవాలి. రియల్ ఎస్టేట్ వ్యాపారాలు నడిచే ప్రాంతాలు, కాంట్రాక్టర్లు ఉన్న ప్రాంతాలే కాకుండా, బస్తీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి. నేడు లష్కర్ నిధుల కొరతతో ఇబ్బంది పడుతోంది. సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రాంత అభివృద్ధి కోసం, హైదరాబాద్ ప్రజల సమస్యల పరిష్కారం కోసం బిజెపి తరఫున పోరాటం చేసి, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బండ కార్తికరెడ్డి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి, జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్,స్థానిక నాయకులు వంజరి రమేష్, బండ శివారెడ్డి, కందాడి నాగేశ్వర్ రెడ్డి, శారద మల్లేష్, ఉపేందర్ యాదవ్, వెంకటేష్ గౌడ్, పోచయ్య యాదవ్, మల్లికంటి వీరన్న, కొన్నె సంపత్, సుక్కగణేష్ ముదిరాజ్, భిక్షపతి, రామువర్మ, కారుణాకర్, ప్రకాష్ గౌడ్ తో పాటు డీసీ సుభాష్ రావు. డిఈ సానిటేష్ వేణు, డిఈ ఎలక్ట్రికల్ ప్రసన్న, డిఈ సువర్ణ, డిజీపీ, డీజీఎం సరిత, వేణుతో పాటు మహిళా నాయకురాలు అనిత, అనూష, డివిజన్ మహిళా అధ్యక్షురాలు సత్యవతి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సునీల్ ముదిరాజ్, హనుమంత్ యాదవ్ తో పాటు పలువురు పాల్గొన్నారు. మెట్టుగూడలో డివిజన్ నాయకులు దేవుడు కుమార్ ఆహ్వానం మేరకు అమ్మవారి ఆలయంలో కిషన్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

# ఏప్రిల్ 14న భారత రాజ్యాంగ రక్షణ ర్యాలీ: డాక్టర్ పిడమర్తిరవి

సికింద్రాబాద్,, వార్త మిర్రర్ మార్చి 15... భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఈ జయంతిని పురస్కరించుకొని ఏప్రిల్ 14న భారత రాజ్యాంగ రక్షణ ర్యాలీ నిర్వహిస్తామని ఎస్సీ ర్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. బిఎస్ఎఫ్ 5వ రాష్ట్ర మహాసభ బిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ అధ్యక్షతన ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ న్యూ సెమినార్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన పిడపర్తి రవి మాట్లాడుతూ భారతదేశంలో బిజెపి పాలనలో భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని భారత రాజ్యాంగ రక్షణ బాధ్యత ప్రతి భారతీయ పౌరునిపై ఉందని అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థి యువజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న ట్యాంక్ బండ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర భారత రాజ్యాంగ రక్షణ ర్యాలీ నిర్వహిస్తామని అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబెడ్కర్ కు నిత్య పూలమాల కార్యక్రమం ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజ్ యందు ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వచ్చే ఆదివారం నుంచి నిత్య పూలమాల కార్యక్రమం ఉంటుందని అన్నారు.కాన్షి రాం ఆశయాల కోసం ప్రతినిత్యం విద్యార్థులు అప్రమత్తంగా ఉండి ఆశే సాధన కోసం పనిచేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల కు పెద్దపీట వేసింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. కాంగ్రెస్ పార్టీతో సామాజిక న్యాయం జరుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ బహుజనులకు పెద్దపీట వేసి వివిధ పదవులు కట్టబెడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన విశిష్ట అతిథి గిరిజన శక్తి జాతీయ అధ్యక్షులు వెంకటేష్ చౌహన్ మాట్లాడుతూ కాన్సిరాం బహుజన రాజ్యం తెచ్చిన గొప్ప మహనీయులని వారి ఆశయ సాధన కోసం విద్యార్థి యువకులు నిరంతరం శ్రమించాలని అన్నారు. కాన్సిరాం స్ఫూర్తితో పని విధానంతో బిజెపి భారతదేశంలో అధికారంలోకి వచ్చిందని కాన్సిరాం బి ఎస్ ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ అగ్రవర్ణాలలోని పేద విద్యార్థుల కోసం పోరాడే ఏకైక విద్యార్థి



సంఘం బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ అని అన్నారు, గడిచిన రెండు దశాబ్దాల కాలం నుంచి ఉస్మానియా విశ్వవిద్యాలయంతో పాటు అనేక విశ్వవిద్యాలతో పాటు అనేక కళాశాల పాఠశాలలో విద్యార్థి సమస్యల పైన బిఎస్ఎఫ్ అలుపెరగని పోరాటం చేస్తుందని ఎన్నో విద్యార్థి సమస్యల పరిష్కారా%శీ% చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకురాలు కోటగిరి ఉషారాణి, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గాద వెంకట్, బిఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోలు రాములు, బిఎస్ఎఫ్ ఓయూ ఇన్చార్జి కల్వకుర్తి శ్రీశైలం,బిఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, హూమెన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షులు మాధవచారి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ నంద్రు నరసింహ, డాక్టర్ మీసాల మల్లేష్, ఏర్పుల శ్రావణ్, డాక్టర్ బొమ్మెర స్టాలిన్, బి ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఆరెకంటి శ్రీకాంత్, పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు వలిగొండ నరసింహ, సామాజిక తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తాళ్ల అజయ్, బిఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చెవుల కిషన్, బేగరి మోహన్, మాదిగ మేధావుల పురం నాయకులు దర్శనం జాన్,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు నవీన్ రాజ్, నాగరాజు రాజేష్, ప్రవీణ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో హెల్త్ పెన్షన్ అమలు చేయాలి

## -తలసేమియా వెల్ఫేర్ సొసైటీ

### రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ -



మందమర్రి మార్చి 15: వార్త మిర్రర్ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రంలో అనేక మంది ప్రజలు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడు తున్నారని వారికి రాష్ట్ర ప్రభుత్వం హెల్త్ పెన్షన్ అమలు చేయాలని తల సేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరుల తో మాట్లాడారు. అనేక మంది దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్నారని, అంతే కాకుండా పక్షవాతం వల్ల మంచానికే పరిమితం అయిన వారికి, తీవ్ర కండరాల దుర్బ లత, ప్రమాదాల కారణంగా వీల్ చైర్, మంచానికి పరిమిత మైన వారికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము 15 వేల రూపాయలను ప్రతి నెల హెల్త్ పెన్షన్ అందిస్తుందనీ ఆయన గుర్తు చేశారు. దీర్ఘకాలిక వ్యాధులు అయిన తల సేమియా, సికిల్ సెల్, హిమోఫిలియా, డబుల్ ఎలిఫెంటియాసిస్ గ్రేడ్ 4, నిరంతర మూత్రపిండాల వ్యాధి, కుష్టి వ్యాధి, తీవ్రమైన బోదకాలు, పోలియో, కిడ్నీ, లివర్, హార్ట్ మార్పిడి అయినవారికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము సదరం సర్టిఫికెట్ తో సంబంధం లేకుండా ప్రతినెల పదివేల రూపాయల పెన్షన్ తో పాటు ఉచిత వైద్యాన్ని అందిస్తున్నారని దీనిని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసి బాధితులకు ప్రభుత్వం అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న నిరుపేదలకు హెల్త్ పెన్షన్ అమలు చేసి వారికి మనోధైర్యం కల్పించా లని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# ఉస్మానియా యూనివర్సిటీ అప్రజాస్వామిక సర్క్యులర్.: చటారి దశరథ్.



సికింద్రాబాద్, వార్త మిర్రర్ మార్చి 15 .....యూనివర్సిటీ విడుదల చేసిన సర్క్యులర్ అప్రజాస్వామికమని, నిర్బంధపాలనకు నిదర్శనమని బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ పేర్కొన్నారు. ఈ మేరకు చటారీ దశరథ్ ఓయులో శనివారం మాట్లాడుతూ యూనివర్సిటీలో ఎటువంటి ధర్నాలు, నిరసనలు, స్లోగన్స్ గానీ చేస్తే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని సర్క్యులర్ ద్వారా విద్యార్థి సంఘాలను బెదిరిస్తున్న యూనివర్సిటీ పెద్దల పెద్దల తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.ఇది విద్యార్థుల యొక్క హక్కులను కాలరాయడమే కాకుండా విద్యార్థుల గొంతులు నొక్కే ప్రయత్నం ఈ నిర్ణయం అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కంచెలెత్తేసి ప్రజా ప్రభుత్వం, ప్రజా పాలన అంటూ గొప్పలు పలికిన ప్రభుత్వమా ఇదేమిటి?రాష్ట్రంలో ప్రజాపాలన పేరుతో ప్రశ్నిస్తూ, నిరసన తెలుపుతున్న ఎంతోమంది విద్యార్థులపైన కేసులు బనాయించడం, జైలుకు పంపుతున్న తీరు నిర్బంధ పాలనకు నిదర్శనం అన్నారు.ఒకవైపు ఈరోజు అసెంబ్లీలో ముఖ్యమంత్రి అసహనంగా, అభద్రతాభావంతో నామీద మాట్లాడినోళ్లని బట్టలూడదీసి కొడ్తా అనడం, యూనివర్సిటీ ఈ ప్రకటన చేయడం. విశ్వవిద్యాలయ స్వయం ప్రతిపత్తిని కాలరాస్తూ నిరంకుశ ప్రభుత్వ తీరుకు వత్తాసు పలకడం అప్రజాస్వామికం అన్నారు. ముక్తకంఠంతో విద్యార్ది సంఘాలు మరియు ప్రజా సంఘాలు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించాల్సిన అవసరమున్నదని వారు పేర్కొన్నారు.



## బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కాన్సిరాం 91వ జయంతి వేడుకలు

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మార్చి15

చౌటుప్పల్ మండల కేంద్రంలో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మాన్యశ్రీ కాన్సిరాం 91 వ జయంతి వేడుకలు ఘనంగా శని వారం రోజున బస్టాండ్ ఆవరణలో నిర్వహించడం జరిగింది. అనంతరం మండలం అధ్యక్షులు మాధ రమేష్ మున్సిపాలిటీ అధ్యక్షుడు కత్తుల పరమేష్ మాట్లాడుతూ కాన్సిరాం ఆశయాలు కొనసాగిస్తామని బహుజనులకు న్యాయం జరగాలంటే బహుజనులకే అధికారం రావాలన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుక్క సుదర్శన్, గడ్డ మీది బాబు ఎర్రోళ్ల ఇస్తారి, ఉపాధ్యక్షుడు మస్కు ఉదయ్, మాద యాదయ్య, తదితరులు పాల్గొన్నారు..



# నలంద విద్యార్థుల ఎడ్యుకేషనల్ టూర్

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మార్చి 15

చరిత్రను అవగాహన చేసుకోవడం కోసం విద్యార్థులకు ఎడ్యుకేషనల్ టూర్లు ఉపయోగపడతాయని నలంద డిగ్రీ కళాశాల వైస్ చైర్మన్ పానుగుళ్ల మల్లేశం అన్నారు. చౌటుప్పల్ మండలం కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాల విద్యార్థులు "వరంగల్ కు నలంద విద్యార్థుల ఎడ్యుకేషనల్ టూర్" పేరుతో ఎడ్యుకేషనల్ టూర్ కి వెళ్లారు. ఈ సందర్భంగా మల్లేశం బస్సులకు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు.వరంగల్ లో ఉన్న వెయ్యి స్తంభాల గుడి, ఖిలా వరంగల్, రామప్ప, భద్రకాళి టెంపుల్ మొదలైన చారిత్రక కట్టడాలను విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా మల్లేశం,మాట్లాడుతూ, నేటి విద్యార్థులు వాట్సాప్, పేస్ బుక్ లకే పరిమితమవున్న సందర్భంలో నలంద విద్యార్థులు మాత్రం వేల సం,, రాల చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచిన చారిత్రక కట్టడాలను సందర్శించడం అభినందనీయం అని అన్నారు. కాకతీయుల అద్భుత పాలనకు, వారి కళా నైపుణ్యానికి ఈ కట్టడాలు సజీవ సాక్ష్యం అని అన్నారు. యునెస్కో గుర్తింపు పొందిన ప్రపంచ పేరెన్నిక గన్న రామప్ప సుందర మనోహరమైన కట్టడం అని అన్నారు. విద్యార్థులు ఇలాంటివి సందర్శించడం ద్వారా చరిత్రను లోతుగా తెలుసుకోవడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులు ప్రతీ కట్టడాన్ని గూర్చి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఆ అధ్బుతమైన నిర్మాణాలను తమ మొబైల్లో (ఫోన్ లల్లో) బంధించారు. ఈ టూర్ లో కళాశాల డైరెక్టర్ చిలువేరు దుర్గయ్య, మెసేజ్ ప్రోగ్రాం ఆఫీసర్ కట్టెల లింగస్వామి, అధ్యాపకులు కడగంచి రాములు, నాగలక్ష్మి, చంద్రశేఖర్, మహేష్, విజయరాణి, శ్రీదేవి విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.